# జెన్ జీరో ఇంక్

## - నిర్మలాదిత్య



### *నాంది*

*(లక్ష్మి సైబర్ సెక్యూరిటీ రంగంలో పనిచేస్తూ, ప్రపంచంలోని ఆర్ధిక నేరాలు, అవి చేస్తున్న ప్రముఖ రాజకీయ నాయకుల, వ్యాపార వేత్తల పేర్లు 'పనామా పేపర్స్' ద్వారా బయట పెట్టింది ("క్షీర సాగర మథనం" కౌముది జనవరి 2023 నుంచి జనవరి 2024 వరకు వచ్చిన సీరియల్ నవల).*

అటు తరువాత -

లక్ష్మి తండ్రి విశ్వం అనుకున్నట్లే, ఈ నేరాలు చేసిన వ్యక్తుల పేర్లు తెలిసిన తరువాత కూడా, ఎక్కడో ఒక ఐస్ లాండ్ ప్రధాని శిక్షించ బడడం తప్పితే, మిగిలిన వారందరూ బాగానే ఉన్నారు.

భారత దేశంలో ఉన్న పారిశ్రామిక వేత్త పి.ఎల్. (పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) ప్రభుత్వం సహాయం తో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పి ప్రంపంచంలోని, బిల్ గేట్స్, ఎలన్ మస్క్ ల బిలియనీర్ల లిస్ట్ లో చేరి పోయాడు.

పి.ఎల్. కొడుకు అరసు(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు)తండ్రి అడుగుజాడల లో నడుస్తూనే ఉన్నాడు.

సిద్దార్థ(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) పి.ఎల్ ఆర్థిక పెట్టు బడితో, తన కల్ట్ సినీ ఫ్యాన్స్ అండదండలతో భారత ప్రధాని పదవికి అతి చెరువులో ఉన్నాడు.

వినోద్ ప్రభుత్వ రంగంలో పని చేస్తూ, పి.ఎల్. లాంటి నేరస్తులను కేరీర్ మొత్తం పట్టుకోవాలని ప్రయత్నించి, విఫలమై రిటైర్ అయ్యి పోయాడు.

పి. ఎల్. స్నేహితుడు పీర్ క్యాన్సర్ తో చనిపోయాడు.

పీర్ కొడుకు డాక్టర్ సలీం తండ్రి క్యాన్సర్ కు కారణం పి.ఎల్ కంపెనీలు చేసిన కాలుష్యం అని తెలిసినా, పి. ఎల్. కట్టిన కొత్త పెద్ద హాస్పిటల్ కు డైరెక్టర్ కావడంతో, హామ్లెట్ మనస్తత్వం తో పని చేస్తూనే ఉన్నాడు.

పీర్ కూతురు ఆయషా, అరసు తో కలసి చదువుతున్నప్పుడు ప్రేమలో పడి, మనస్పర్థల వల్ల బ్రేక్ అప్ అయ్యి, ఆ అనుభవం నుండి కోలుకొని లక్ష్మి కంపెనీకి పని చేస్తున్నది. అరసు ఎప్పుడో ఒక సారి మనసు మార్చుకొని తిరిగి అమెరికాకి తన దగ్గర వస్తాడని ఆశ. అది ఒక గొంతెమ్మ కోరిక అని తనకి తెలుసు.

లక్ష్మి మియామీ నుండి తన కంపెనీ టాంప బే లోని వెస్లీ ఛాపెల్ అనే సబర్బ్ కు మారింది. ఫ్లోరిడా రాష్ట్రంలో పూర్తిగా దక్షిణంలో ఉన్న మియామీ కంటే రాష్ట్రం మధ్యలో ఉన్న టంపా బే తన బిజినెస్ కు మంచిదని పించింది. తూర్పున ఓర్లాండో ఒక గంట ప్రయాణం, ఉత్తరం గెయిన్స్ విల్, రాష్ట్ర రాజధాని టాళ్ళహస్సీ, జాక్సన్ విల్, దక్షిణాన నేపుల్స్, మియామీ అన్నీ కారులో కొన్ని గంటల ప్రయాణాలే. పొద్దున్న పోయి పని చూసుకొని సాయంత్రానికి వచ్చేయ వచ్చు.

అలానే తండ్రి నివసిస్తున్న టార్పాన్ స్ప్రింగ్స్, బీచ్ టౌన్ లు క్లియర్ వాటర్, సెయింట్ పీటర్స్ బర్గ్, సరసోట అన్నీ లక్ష్మి ఉంటున్న వెస్లీ ఛాపెల్ కు ఒక గంట లోపు దూరంలోనే ఉన్నాయి. ఇవన్నీ టాంప బే సబర్బ్ లు.

లక్ష్మి తను టాంప బే మారడంతో కొత్త కంపెనీ జెన్ జీరో ఇంక్ పెట్టింది. ఆయషా, లక్ష్మి లకు కొత్త పనులు, ప్రాజెక్టులు వస్తూనే ఉన్నాయి. చేసిన ప్రతీ పని గొప్పగా చేయడం వల్ల కంపెనీకి పేరు రావడంతో బాటు మరింత ఛాలెంజింగ్ పనులు వస్తున్నాయి.

జెన్ జీరో ఇంక్ పనిచేసే ప్రాజెక్ట్ లు సామాన్యులకు అంతుబట్టని రహస్య ప్రపంచంలోనే … )

*లక్ష్మి సైబర్ సెక్యూరిటీ రంగంలో పనిచేస్తూ, ప్రపంచంలోని ఆర్థిక నేరాలు, అవి చేస్తున్న ప్రముఖ రాజకీయ నాయకుల, వ్యాపార వేత్తల పేర్లు 'పనామా పేపర్స్' ద్వారా బయట పెట్టింది ("క్షీర సాగర మథనం" కౌముది జనవరి 2023 నుంచి జనవరి 2024 వరకు వచ్చిన సీరియల్ నవల).*

అటు తరువాత -

లక్ష్మి తండ్రి విశ్వం అనుకున్నట్లే, ఈ నేరాలు చేసిన వ్యక్తుల పేర్లు తెలిసిన తరువాత కూడా, ఎక్కడో ఒక ఐస్ లాండ్ ప్రధాని శిక్షించ బడడం తప్పితే, మిగిలిన వారందరూ బాగానే ఉన్నారు.

భారత దేశంలో ఉన్న పారిశ్రామిక వేత్త పి.ఎల్. (పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) ప్రభుత్వం సహాయం తో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పి ప్రపంచంలోని, బిల్ గేట్స్, ఎలన్ మస్క్ ల బిలియనీర్ల లిస్ట్ లో చేరి పోయాడు.

పి.ఎల్. కొడుకు అరసు(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుదు)తండ్రి అడుగుజాడల లో నడుస్తూనే ఉన్నాడు.

సిద్దార్థ్(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుదు) పి.ఎల్ ఆర్థిక పెట్టు బడితో, తన కల్ట్ సినీ ఫ్యాన్స్ అండదండలతో భారత ప్రధాని పదవికి అతి చెరువులో ఉన్నాడు.

వినోద్ ప్రభుత్వ రంగంలో పని చేస్తూ, పి.ఎల్. లాంటి నేరస్తులను కేరీర్ మొత్తం పట్టుకోవాలని ప్రయత్నించి, విఫలమై రిటైర్ అయ్యి పోయాడు.

పి. ఎల్. స్నేహితుడు పీర్ క్యాన్సర్ తో చనిపోయాడు.

పీర్ కొడుకు డాక్టర్ సలీం తండ్రి క్యాన్సర్ కు కారణం పి.ఎల్ కంపెనీలు చేసిన కాలుష్యం అని తెలిసినా, పి. ఎల్. కట్టిన కొత్త పెద్ద హాస్పిటల్ కు డైరెక్టర్ కావడంతో, హామ్లెట్ మనస్తత్వం తో పని చేస్తూనే ఉన్నాడు.

పీర్ కూతురు ఆయషా, అరసు తో కలసి చదువుతున్నప్పుడు ప్రేమలో పడి, మనస్పర్థల వల్ల బ్రేక్ అప్ అయ్యి, ఆ అనుభవం నుండి కోలుకొని లక్ష్మి కంపెనీకి పని చేస్తున్నది. అరసు ఎప్పుడో ఒక సారి మనసు మార్చుకొని తిరిగి అమెరికాకి తన దగ్గర వస్తాడని ఆశ. అది ఒక గొంతెమ్మ కోరిక అని తనకి తెలుసు.

లక్ష్మి మియామీ నుండి తన కంపెనీ టాంప బే లోని వెస్లీ ఛాపెల్ అనే సబర్బ్ కు మారింది. ఫ్లోరిడా రాష్ట్రంలో పూర్తిగా దక్షిణంలో ఉన్న మియామీ కంటే రాష్ట్రం మధ్యలో ఉన్న టంపా బే తన బిజినెస్ కు మంచిదని పించింది. తూర్పున ఓర్లాండో ఒక గంట ప్రయాణం, ఉత్తరం గెయిన్స్ విల్, రాష్ట్ర రాజధాని టాళ్ళహస్సీ, జాక్సన్ విల్, దక్షిణాన నేపుల్స్, మియామీ అన్నీ కారులో కొన్ని గంటల ప్రయాణాలే. పొద్దున్న పోయి పని చూసుకొని సాయంత్రానికి వచ్చేయ వచ్చు.

అలానే తండ్రి నివసిస్తున్న టార్పాన్ స్ప్రింగ్స్, బీచ్ టౌన్ లు క్లియర్ వాటర్, సెయింట్ పీటర్స్ బర్గ్, సరసోట అన్నీ లక్ష్మి ఉంటున్న వెస్లీ ఛాపెల్ కు ఒక గంట లోపు దూరంలోనే ఉన్నాయి. ఇవన్నీ టాంప బే సబర్బ్ లు.

లక్ష్మి తను టాంప బే మారడంతో కొత్త కంపెనీ జెన్ జీరో ఇంక్ పెట్టింది. ఆయషా, లక్ష్మి లకు కొత్త పనులు, ప్రాజెక్టులు వస్తూనే ఉన్నాయి. చేసిన ప్రతీ పని గొప్పగా చేయడం వల్ల కంపెనీ కి పేరు రావడంతో బాటు మరింత ఛాలెంజింగ్ పనులు వస్తున్నాయి. లక్ష్మి బాయ్ ఫ్రెండ్ లారెన్స్ ఎఫ్.బి.ఐ కి పనిచేస్తున్నాడు.

జెన్ జీరో ఇంక్ పనిచేసే ప్రాజెక్ట్ లు సామాన్యులకు అంతుబట్టని రహస్య ప్రపంచంలోనే ... )

లోగుట్టు పెరుమాళ్ళకు ఎరుక

(ముగింపు)

(జరిగిన కథ: రాజా నడుపుతున్న మంగా హెడ్జ్ ఫండ్ కంపెనీ స్టాక్ మార్కెట్ లో అనూహ్యమైన లాభాలు చేసుకుంటున్నది. మిట్టల్ గ్రూప్ షేర్ల వ్యాపారంలో కూడా మంచి లాభాలు, మంగా హెడ్జ్ ఫండ్ కి మిట్టల్ గ్రూప్ ఆర్థిక రిపోర్టులు ప్రకటించే సమయంలో రావడంతో, మంగా హెడ్జ్ కంపెనీ ఇన్సైడర్ ట్రేడింగ్ కు పాలు పడింది అన్న అనుమానం మిట్టల్ గ్రూప్ కు వచ్చింది. అది నిజమో కాదో తెలుసుకోవడానికి మిట్టల్ గ్రూప్ ఆ ఇన్వెస్టిగేషన్ లక్ష్మి నడుపుతున్న జెన్ జీరో ఇంక్ కి ఇచ్చింది. లక్ష్మి ఆ ప్రాజెక్టు పని మీద ఆయషా ను భారత దేశానికి పంపించింది. బ్రేక్ అప్ తరువాత కూడా, ఆయషా ను ప్రేమిస్తూ వెంట బడుతున్న అరసు, ఆయషా ను ముంబై లో కలిసి, అక్కడ నుంచి చెన్నై కు తన ప్రైవేటు జెట్ లో తీసుకెళ్లాడు. ఆయషా తన ప్రాజెక్టు పని చెన్నై లో ఉన్న మిట్టల్ గ్రూప్ ఫైనాన్స్ విభాగం ఆఫీస్ లో మొదలెడుతుంది ).

మరుసటి రోజు, ఆయషా తమ కంపెనీ కనిపెట్టిన ఫోరెన్సిక్ టూల్స్ ఉపయోగించి, ఎవరైనా మిట్టల్ కంపెనీ డేట సంగ్రహించారా, లేక అలా దొంగలించడానికి అవకాశం ఉందా అని వెదికింది. ఫైనాన్స్ విభాగంలో పని చేస్తున్న వారి వివరాలు బ్యాక్ గ్రౌండ్ రిపోర్ట్ల తో సహా చూసింది. అన్ని సరిగానే ఉన్నాయి.

బ్రేక్ తీసుకుందామని, అలా నడుస్తూ రతి దగ్గరికి వెళ్ళింది. రతి తన రూం లో సోఫా లో కూర్చొని పని చేస్తూ ఉంది. రతి కూర్చునే టేబిల్ మీద ఆవిడ పని చేస్తున్న ఫైళ్లు చిందర వందరగా పడి ఉన్నాయి. ఆయషా ను చూస్తూనే 'ఒక నిమిషం' అంటూ సైగ చేసి, తను అవతల మాట్లాడుతున్న వ్యక్తి తో సంభాషణ ముగించేసింది.

"తరువాత రానా?" అంది ఆయషా.

"నో. టెక్ సర్వీస్ వాళ్ళతో పని బడింది. కంపెనీ నెట్వర్క్ తో కనెక్ట్ చేయ లేకపోతున్నాను. ఇదిగో సోఫాలో కూర్చుని, నా ఫోన్ హాట్ స్పాట్ ద్వారా నెట్వర్క్ కు కనెక్ట్ అయ్యి ఆఫీస్ పని చేస్తున్నాను. ఇప్పుడు మీతో మాట్లాడ గలను. వాట్ కేన్ ఐ డు?" అడిగింది రతి.

"పని చేయడం లేదా? నాకు ఎలాంటి ఇబ్బందులు రాలేదే. మీరిచ్చిన సిస్టమ్ బాగానే పనిచేస్తున్నది. రూం లో ఉన్న కేబుల్ కు నా కంప్యూటర్ కనెక్ట్ చేస్తే, మీ కంపెనీ నెట్వర్క్ కు వెంటనే కనెక్ట్ అయ్యింది ."

"నాకే పరిమితమైన సమస్య లాగా ఉంది. నా కంప్యూటర్ రూం లోని కేబుల్ లకు కనెక్ట్ చేస్తే, పనిచేయడం లేదు. 'నెట్వర్క్ ఎర్రర్' అని మెసేజ్ వస్తుంది. ఇదిగో ఇంత సేపు ఆ టెక్ అతనితోనే మాట్లాడుతున్నాను. తనూ నువ్వన్నట్లే

సమస్య కనపడలేదు అన్నాడు. తనే స్వయంగా వచ్చి చూస్తాను అన్నాడు. ఇదిగో అంతవరకు, నా ఆఫీస్ మొబైల్ ను ఉపయోగించి పని చేస్తున్నాను."

"అతను వచ్చాడంటే మళ్ళీ నీ పనికి అంతరాయమేమో కదా? రిమోట్ గానే ట్రబుల్ షూట్ చేసి పరిష్కరించ వచ్చు గదా."

"సెంథిల్ ను నువ్వు కలువలేదనుకుంటా. ఇక్కడ పని చేస్తున్న వారందరికీ బాగా తెలుసు. మంచి కలుపుగోలు మనిషి. నా పనికి ఇబ్బంది రాకుండా, నా లంచ్ టైం లో తను ఇక్కడ నా రూంలో పనిచేసి సమస్య ఏంటో కనుక్కొని పరిష్కరిస్తానని చెప్పాడు. అన్నట్టు మీ పనేలా సాగుతుంది. ఇబ్బందులు ఏమీ లేవు కదా?"

ఆయషా రతి దగ్గర "ఇబ్బందులు ఏవీ లేవు. అన్నీ బాగానే ఉన్నాయి," అని కొంత సేపు మాట్లాడి, తన రూంకు తిరిగి వెళ్ళి పోయింది

లంచ్ సమయం కాగానే, కేఫ్టేరియ కు పోతూ దారిలో రతి రూం లోకి తొంగి చూసింది. లోపల రతి చెప్పిన సెంథిల్ అయ్యి ఉండాలి, ఏదో వైర్ లు చెక్ చేస్తున్నాడు.

"రతి లంచ్ కు వెళ్ళింది," ఆయషా కు చెప్పాడు.

"తెలుసు. మీ పేరు సెంథిల్?" అడిగింది ఆయషా, రతి టేబిల్ పై నున్న పేపర్లు చూస్తూ

"అవును. ఐ యాం సెంథిల్. మీకెలా తెలుసు?," అన్నాడు.

"రతి చెప్పింది. సరే రతి ని కేఫ్టేరియా లో కలుస్తాను."

ఆయషా కేఫ్టేరియా లో ఇడ్లీ, వడా ట్రే తీసుకొని రతి కోసం వెదికి, రతి పక్క కూల బడింది.

" వస్తూ, నీ రూం లోకి తొంగి చూసాను. టెక్ మనిషి , ఆ సెంథిల్ పనిచేస్తున్నాడు," అంది ఆయషా.

" అవును, అతను వచ్చిన తరువాతే నేను లంచ్ కని ఇక్కడికి వచ్చాను. అయినా నువ్వు ఇక్కడికి రావడామేమిటి? నీ రూం లో నుండే నాకు ఒక ఫోన్ కాల్ చేస్తే ఎగ్జిక్యూటివ్ కిచెన్ నుంచే ఫుడ్ పంపే వారం కదా."

"నో. నాకు ఇదే నచ్చుతుంది. ఇక్కడికి నడిచివస్తే కొంత వ్యాయామం, కొంత బ్రేక్ దొరుకుతుంది. మీ అందరితో మాట్లాడే అవకాశం కూడా కదా. అంతే కాక, నాకు ఒంటరిగా తినడం ఇష్టం లేదు."

"గ్రేట్. ఇక్కడి ఫుడ్ కూడా బాగానే ఉంటుంది."

"అన్నట్టు సెంథిల్ ను, అతను పని చేస్తున్న విభాగంలోని మనుష్యులను కలిస్తే బాగుంటుంది. వీలౌతుందా?"

"ఎందుకు కాదు. ఆ పని కూడా చేద్దాం. ముందు తినండి."

"ఫైనాన్స్ విభాగం ఆడిట్ చేసినట్లే, ఈ టెక్ విభాగాన్ని కూడా ఆడిట్ చేయాలి. టెక్ విభాగం, అక్కడ పనిచేస్తున్న వారి వివరాలకు నాకు ఆక్సెస్ కావాలి."

"దానికేం. లంచ్ తరువాత ఆ పని మీదే ఉంటా. ఆ పని నిమిషాలలో అయ్యిపోతుంది. నేను ఒక టికెట్ ఓపెన్ చేస్తే చాలు."

అలా కబుర్లతో, రతి, ఆయషా లకు లంచ్ టైం ఇట్టే గడిచిపోయింది.

ఆయషా ఆ రోజు, మరుసటిరోజు కూడా టెక్నాలజీ లో పని చేస్తున్న వారి వివరాలు ముఖ్యంగా కంప్యూటర్లు పని చేయకపోతే సహాయం చేసే వారి వివరాలు పరిశోధించింది. అందులో తేలిన విషయం, మిట్టల్ గ్రూప్ ఫైనాన్స్ త్రైమాసిక ఫలితాలు బోర్డ్ కు సమర్పించే ముందు తారీఖులలో రతి కంప్యూటర్ సిస్టమ్ బాగా లేదని టిక్కెట్లు తెరవడం చూసింది. అలానే రతి కి వచ్చిన సమస్య పరిష్కరించడానికి ప్రతీ సారీ రిమోట్ లో కాకుండా, రతి రూం కు సెంథిల్ వచ్చిన తరువాతనే ఆ సమస్య పరిష్కారం కావడం చూసింది. ఆ పరిష్కారం కూడా మధ్యాహ్నం 12 ప్రాంతంలో జరగడం ఆయషాకు అనుమానం తెప్పించింది.

మిట్టల్ గ్రూప్ రిజల్ట్స్ రెండు నెలల క్రితం బోర్డ్ కు త్రైమాసిక ఫలితాలు సమర్పిస్తుండగా లీక్ అయ్యి ఉండాలి. దాని తరువాత ఆ కంపెనీ వివరాలు పబ్లిక్ కి ప్రకటించారు. ఆ మధ్యలో ఈ లీకైన వివరాల ఆధారంగా, రాజ మంగా హెడ్జ్ కంపెనీ ద్వారా మిట్టల్ గ్రూప్ స్టాక్ ల మీద వ్యాపారం చేసి, అమిత లాభాలు సంపాదించి ఉండాలి. ఆయషా కు మిట్టల్ గ్రూప్ కంప్యూటర్ ల లో నుంచి ఎక్కడా సమాచారం లీక్ కాలేదని తెలిసింది. ఇక మిగిలింది తనకు వచ్చిన చివరి అనుమానం తీర్చుకోవడమే.

"రతి. మీ ఆఫీసుకు సర్విలేన్స్ కని సి.సి. కెమెరాలు ఉన్నాయి కదా. నేను కొన్ని చూసాను. వాటి వీడియో ఫైల్స్ దొరుకుతాయా. రెండు నెలల క్రితం, దానికి మూడు నెలల క్రితంవి కావాలి," ఆయషా రతికి ఫోన్ చేసి అడిగింది.

"ఆ బిల్డింగ్ సెక్యూరిటీ టీం వేరేగా ఉంది. ఇప్పుడే ఆ విభాగం అధికారితో కాన్ఫరెన్స్ చేస్తాను. నీకు కావలసిన పని అయ్యిపోతుంది. 'హలో సెక్యూరిటీ డిపార్ట్మెంటా? రాజీవ్? అమెరికా నుంచి మన కంపెనీ పని మీద ఆయషా అనే కన్సల్టెంట్ వచ్చారు. వారికి  మీ పాత క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరా రికార్డులు కావాలంట. ఆవిడకి అన్ని క్లియరెన్స్ లు ఉన్నాయి. కాబట్టి మీరు కంప్యూటర్ లో  షేర్ చేయడానికి ఎలాంటి అడ్డంకులు ఉండకూడదు. ఉంటే చెప్పండి, నేను వాటిని తీయించేస్తాను. ఆయషా, ఆ అమెరికా కన్సల్టెంట్,  పేరు మీద నేనే మీ విభాగానికి ఒక సర్వీసు టికెట్ ఓపెన్ చేస్తాను.'"

"తప్పకుండా రతి గారు. మీకు కావలసిన వివరాలు నాకు టికెట్ అందిన వెంటనే పంపిస్తాను," అన్నాడు రాజీవ్.

తరువాత అరగంట లోపే ఆయషాకు సెక్యూరిటీ విభాగం నుంచి కావలసిన ఫైళ్లు దొరికాయి. తనకు అనుమానం వచ్చిన బోర్డ్ మీటింగ్ కు వారం రోజుల ముందు ఫైళ్లు చూసింది. ముఖ్యంగా రతి పనిచేస్తున్న పరిసరాలలో. సెంథిల్,  రతి రూం కు లంచ్ టైంలో రావడం, రతి కొంత సేపు సెంథిల్ తో మాట్లాడి లంచ్ కు వెళ్లిపోవడం కనబడింది. రతి వెళ్లిన తరువాత కూడా సెంథిల్ ఆ రూం లోనే పని చేస్తూ అటూ, ఇటూ తిరుగుతూ,  ఉన్నట్టుండి తన ఫోన్ తీసుకొని లక్ష్మి  టేబిల్ మీదున్న పేపర్ల ఫోటో లు టక టక తీయడం మొదలెట్టాడు. తనకు వేటి ఫోటో లు తీయాలో మంచి అవగాహన ఉన్నట్లు ఉంది. ఫోటోలు తీసిన తరువాత, తన వెంట తెచ్చిన టూల్ బాక్స్ లో నుంచి ఒక కేబుల్ వైర్ తీసి రతి కంప్యూటర్ కు తగిల్చిన కేబుల్ వైర్ బదులు కనెక్ట్ చేసి వెళ్లిపోయాడు. వైర్ మార్చిన తరువాత రతి సమస్య పరిష్కారం అయ్యిందో లేదో కూడా చూడలేదు.

అయషా దానికి ముందు రోజు వీడియో కూడా చూసింది. తను  ఊహించినట్లే, ముందు రోజు అదే సెంథిల్,  ఆఫీస్ లో అందరూ వెళ్ళిపోయేంత వరకు వేచి, రతి రూం కు ఏమీ అవసరం లేకున్నా వెళ్లి, ఒక కేబుల్ మార్చడం చూసింది. అప్పుడు రతి టేబిల్ మొత్తం ఖాలీగా ఉంది. ఇంటికి పోయే ముందు తన ఫైళ్లు, వస్తువులు డ్రాయర్ లలో పెట్టి, తాళం వేయడం కూడా ఆయషా ఆ సెక్యూరిటీ ఫైళ్ళ ద్వారా చూసింది.

ఆయషా కు తన అనుమానం నివృత్తి అయ్యింది. సెక్యూరిటీ టీం లో పని చేస్తున్న సెంథిల్,  రతి రూం కు ముందు రోజు పోయి మంచి కేబుల్ బదులు, ఒక పనిచేయని కేబుల్ మార్చే వాడు.  మరుసటి రోజు రతి తన సిస్టమ్ పని చేయలేదంటే, ఆవిడ రూం కు లంచ్ టైం లో పోయి, రతి లంచ్ కని ఆ గది వదలి పోయేంతవరకూ వేచి ఉండే వాడు. రతి తన టేబిల్ పైన అలా ఫైళ్లు వదిలేసీ పోవడం సెంథిల్ కు జక్పాట్ తగిలినట్లే. ఆ రోజు రతి టేబిల్ మీదున్న ఫైళ్లలో, బోర్డ్

కు పంపే పేపర్లు కూడా వుండి వుండాలి. సెంథిల్ తీస్తున్న ఫోటోలు బోర్డ్ కు పంపిస్తున్న ఆర్థిక ఫలితాల వై ఉండాలి. ఇక కావలసిన ఋజువు ఆ ఫోటోలు ఆ సెంథిల్ ఫోన్ నుండి ఎక్కడికి వెళ్లిందని. సెంథిల్ అమెరికాలో తనకు తెలిసిన వారికి పంపించి ఉండాలి. అక్కడి నుంచి మంగా హెడ్జి కంపెనీకి, దాని అధినేత రాజా కు ఎలా అందాయో తెలియాలి.

లక్షి కి ఫోన్ చేయాలని సమయం చూసింది. అమెరికాలో మిడ్ నైట్. లక్షి కి తన మెసేజ్ చూసిన వెంటనే ఫోన్ చేయమని మెసేజ్ పెట్టి పడుకుంది.

“ఆయషా. లక్షి ని. ఇప్పుడే నీ మెసేజ్ చూసాను. ఏమైనా బ్రేక్ దొరికిందా?” అడిగింది లక్షి మరుసటిరోజు పొద్దున్నే ఫోన్ చేస్తూ.

“లక్షి . గుడ్ టు హియార్ ఫ్రమ్ యూ. అవును. ఇంట్లో నుంచి మాట్లాడుతున్నాను...” అంటూ తను ఆ రోజు వరకు చేసిన పనంతా లక్షి తో చెప్పింది.

“ఆయషా. గ్రేట్ వర్క్. ఆ సెక్యూరిటీ లో పనిచేస్తున్న సెంథిల్ కాంటాక్ట్ వివరాలు ముఖ్యంగా ఫోన్, ఈమెయిల్ వివరాలు పంపించు. నేను లారెన్స్ సహాయం తీసుకొని, ఎస్.ఈ.సీ ద్వారా సెంథిల్ ఫోన్ టాప్ చేయడానికి ప్రయత్నిస్తాను. దాని వల్ల సెంథిల్ ఇక్కడ మంగా కంపెనీ కి తను తీసిన ఫోటోలు ఎలా అందజేయ గలుతున్నడో తెలిసిపోతుంది. నాకో రెండు రోజులు టైం ఇవ్వు,” అంటూ మరికొంత సేపు మాట్లాడి లక్షి ఫోన్ పెట్టేసింది.

మరుసటి రోజు శుక్రవారం. పొద్దున్న లేచి నప్పటి నుండి ఏదో తెలియని ఆనందను, ఆతృత. అరసు తో తను చాలా రోజులే తిరిగింది. కానీ ఈ మధ్య బ్రేక్ ఆప్ అయ్యి తిరిగి చేరువవ్వు తుంటే మళ్ళీ కొత్తగా ప్రేమలో పడుతున్నట్లు ఉంది. అమ్మ జుబేదా, అన్న సలీం, చివరికి లక్షి కూడా తనకు అరసు పర్ఫెక్ట్ అన్నట్లు చెప్తున్నారు. అరసు కూడా చాలా మారాడు. తను, అరసు మాటలు, ఎలాంటి ప్రతిఘటన లేకుండా తల వంచి వింటానని ఆశించాడు బ్రేక్ అప్ కి ముందు. ఒంటరి పిల్లవాడు కాబట్టి తాను ఆడిందే ఆట అన్నట్లు పెంచారు. అవన్ని, ఒక విధంగా బ్రేక్ అప్ కి కారణమేమో. ఇప్పుడు తన ఆలోచనలు మనసు విప్పి వింటున్నాడు. కావలిస్తే తను మరింత మార గలడని తన మాట, ప్రవర్తనల ద్వారా చెప్తున్నాడు.

ఆఫీసు లో ఋజువు కోసం మరిన్ని వివరాలు సేకరించింది ఆయేషా. పని చేస్తున్నంత సేపు, అరసు మదిలో ఎక్కడో మెదులుతూనే అన్నాడు. సాయంత్రం ఐదు అయ్యి, అవ్వక ముందే అరసు నుంచి ఫోన్.

“అరసు, ఎంటి చెప్పు?” అంది ఆయషా.

ఆయషాకు అరసు  గొంతులో, అదో చెప్పలేని అనుభూతి, తనంటే ఇష్టం, తన ప్రేమ ఒప్పుకోదేమో అన్న భయం, త్వరలోనే కలుస్తున్నామన్న ఆతృత అన్నీ కలగా పులగమైన ఒక ఆనందం వినిపించింది.

“సాయంత్రం ఏడింటికి కలుద్దామనుకున్నాము కదా. నాన్న కలవాలన్నారు. ఫ్రీ గా ఉన్నావా? ఆరింటికి నాన్నను కలుద్దాము, నీకు వీలైతే.”

అరసు నాన్న పి.ఎల్. తనను కలవాలను కోవడమేమిటి? అసలు పి.ఎల్. తన ప్రేమను అంగీకరించక పోవచ్చు నన్నది కూడా తాము విడిపోవడానికి ఒక కారణం. కానీ చిన్నప్పటి నుంచి తెలుసు కాబట్టి, ఆయషా వెంటనే ఒప్పుకుంది.

మరో అరగంటలో ఆరసునే అయషా ను తీసుకుపోవడానికి వచ్చాడు. ఇండియాలో ఇదో సౌకర్యం. డ్రైవ్ చేయాల్సిన అవసరం లేదు. అరసు పర్సనల్ డ్రైవర్ కారు నడుపుతున్నాడు. ఆయషా, అరసు వెనుక సీట్లో కూర్చుని కబుర్లు మాట్లాడు కుంటున్నారు. గట్టిగా హత్తుకోవాలి అన్న కాంక్ష ఇద్దరిలో తీవ్రంగా ఉన్నా, పక్కనే అంటీ అంటనట్లు దగ్గరగా కూర్చొని కబుర్లు చెప్పడం లోని టెన్షన్ ఇద్దరిలో పరస్ఫుట మౌతున్నది. ఇద్దరి మధ్యలో ఆ కెమిస్ట్రీ చూసిన వారికంతా అర్థమయ్యేటట్లు ఉంది.

కారు ఆగినప్పుడు బయట చూస్తే ఇంటి ముందు ఆగినట్లు అనిపించింది ఆయషా కు.

“ అంకుల్ ను ఆఫీస్ లో కలుస్తున్నామనుకున్నాను. ఇంటికి తెచ్చినట్లు ఉన్నావు అరసు?” ఆశ్చర్యంగా అడిగింది ఆయషా.

“నాన్న ఒక్కరే కాదు ఆయషా. అమ్మ కూడా చూడాలంది.”

ఆయషా, పి.ఎల్. తన ఇంటికని ఒక రాజ మహల్ లాంటి సౌధం కట్టుకున్న తరువాత చూడలేదు. తనకు గుర్తున్న ఆనందమైన గడియలు చిన్న తనం వే. అప్పటికి, పి.ఎల్,  తన తండ్రి పీర్ ఇద్దరూ కూడా చెన్నై కు మకాము మార్చ లేదు.

పి.ఎల్ కట్టిన కొత్త ఇల్లు ఆయన సంపాదించిన ఆస్తికి తగినట్లే ఉంది. ప్రపంచంలో అతి పెద్ద బిలియనీర్ ఇల్లు లాగానే ఉంది.

ఆయషా ను చూస్తూనే అరసు అమ్మ సెల్వి ఎదురొచ్చి కౌగిలించుకుంది. పి.ఎల్. కు దూరం నుండే నమస్కారం పెట్టింది ఆయషా.

మరో గంట ఇట్టే గడిచిపోయింది. అరసు పి.ఎల్ కు, సెల్వి కి తన ప్రేమ గురించి చెప్పి ఉండాలి. వారిద్దరూ అయషా ను తమకు కాబోయే కోడలు గానే చూసారు.

“మీ నాన్న వల్లే నేను నా మొదటి బిజినెస్ ఆరంభించాను. అందువల్ల, నా సక్సెస్ లో పీర్ పాత్ర ఎంతో ఉంది. నాతో ఉండమని మీ నాన్నను చాల వేడుకున్నాను. కానీ మీ నాన్న గొప్ప విలువలు, ఖచ్చితమైన అభిప్రాయాలు ఉన్న మనిషి. అందుకే నాకు మీ నాన్న అంటే చాల అభిమానం, ఇష్టం.”

“అమ్మ ఎలా ఉంది?” అంటూ, మరిన్ని కబుర్లు చెప్తూ సెల్వి, ఆయషా చేయి విడువకుండానే సమయమంతా గడిపింది.

యూనిఫాం వేసుకున్న పనివారు అతిథి మర్యాదలు కొరవడకుండా ఏదో స్నాక్స్, డ్రింక్స్ సర్వ్ చేస్తూనే ఉన్నారు. డిన్నర్ కని వీడ్కోలు తీసుకోబోతుంటే, సెల్వి ఆయషా కు ఒక గిఫ్ట్ బ్యాగ్ అందించింది.

ఆయషా పి.ఎల్. సెల్వి చూపిన ఆప్యాయత చూసి ఆశ్చర్యపోయి అరసును అడిగింది.

“మా ఇంట్లో అమ్మాయి లేదు కదా. చిన్నప్పుడు నిన్ను ప్రేమగానే చూసేది. నీకు గుర్తుండే ఉంటుంది. నాన్న కు, అమ్మకు మన గురించి చెప్పాను. మనం విడిపోయింది చెప్పాను. మళ్ళీ కలవాలని నేను ఆశిస్తున్నట్లు కూడా చెప్పాను”

“ఏమన్నారు? నువ్వనుకునట్లు అభ్యంతరం చెప్పారా?”

“లేదు. నేనే వారు మతం వల్ల అడ్డుపడతారను కున్నాను. వారు మీ నాన్నను ఇంటిలోని మనిషిగానే ఇప్పటికీ చూస్తున్నారు, మీ కుటుంబ వివరాలు అప్పుడప్పుడు తెలుసుకుంటూనే ఉన్నారు. నేను, నువ్వు ప్రేమలో పడ్డామంటే తెగ సంతోష పడ్డారు.”

“అంటే నువ్వు, కొంత నేను కూడా మీ అమ్మ నాన్నల గురించి అపోహ పడ్డామన్న మాట.”

“అవును. నాదే పొరబాటు. నా మాట నమ్ము అయషా, నిన్ను ఇంక ఎప్పటికీ విడువను,” అంటూ ఆయషా చేతులు పట్టుకున్నాడు. ఇద్దరి మధ్య ఉన్న అడ్డంకులు ఒక్కసారి బ్రద్దలై విడిపోయినట్లనిపించింది. ఒకరివైపొకరు చూసుకున్నారు. ముందున్న సీట్లో డ్రైవర్ ను కూడా పట్టించుకోకుండా వారి పెదాలు అంటీ అంటనట్లు స్పృశించు కున్నాయి.

అరసు డిన్నర్ కని మహాబలిపురం రోడ్డు మీదున్న తన ప్రత్యేక విల్లా కు తీసుకెళ్లాడు. ఆ ఇల్లు అరసు టేస్ట్ కు తగినట్లు కట్టి, అలంకరించారు. ఇంటి వెనుక డిన్నర్ ఏర్పాటు చేశాడు.  చీకటిలో, ఎదురుగా సముద్రం హోరు మాత్రం వినిపిస్తున్నది. అరగంట తరువాత డిన్నర్ మొదలయ్యేసరికి, చంద్రుడుదయించి వారికొక అందమైన సముద్ర చిత్రం తన వెన్నెలతో గీసేశాడు.

మాటలలో సమయం ఎలా గడిచిపోయిందో తెలియలేదు. ఇన్ని రోజులు చెప్పుకోలేని కబుర్లు ఆనకట్ట తెగిన ప్రవాహంలా పొంగి పొర్లుతున్నాయి.

“నువ్వేమీ చేయాలనుకుంటున్నావు?” అడిగాడు అరసు.

“నాకంటూ నాకు ఒక కెరీర్ ఉండాలి. నా కెరీర్ ఒకరి భార్యగా, సెకండరీ రోల్ చేయడం నాకిష్టం లేదు,” అంది అయషా .

“ఆయషా, నువ్వు ఈ మాట మనం విడిపోక ముందే చెప్పావు. అప్పుడు నాకు సరిగా అర్థం కాలేదు. ఇప్పుడు నా పని వల్ల చాలామంది నీలా ఆలోచించే వారిని కలిసాను. ఇప్పుడు  అర్థం అయ్యిందనుకుంటున్నాను. ఒక వేళ నువ్వెంచుకున్న కెరీర్ కు భంగం కాకుండా మనం కలిసి ఉండవచ్చు అంటే, నువ్వు ఒప్పుకుంటావా?”

“అది సాధ్యం కాదేమో? నేను అమెరికాలో ఉంటున్నాను. నువున్నది ఇండియాలో.”

“అన్నీ సాధ్యమే ఆయషా.  మా పి.ఎల్. గ్రూప్ ప్రపంచమంతా ఉంది. ఎక్కడి నుంచైనా నడపొచ్చు, ఎక్కడైనా నివసించవచ్చు. అది సమస్య కాదు. అంతే కాకుండా జీవితంలో మనం చేయాలను కున్న పనులు, నివసించాలను కున్న ప్రదేశాలు మారుతూనే ఉంటాయి. సహృదయం, ప్రేమాభిమానాలు ఉన్నంత వరకు ఇవి పెద్ద అడ్డంకులు కావు.”

అయషాకు ఆలోచిస్తే అరసు చెప్పిన దానికి తప్పేమీ కనపడలేదు. అరసు తను లక్షి తో నే పని చేస్తాను అని పట్టు బడితే ఒప్పుకుంటాడు. పరిస్థితుల మారితే, అరసు తో మాట్లాడి, ఇద్దరికీ వర్క్ అవుట్ అయ్యేలా ఒక మార్గం వెదుక్కోవచ్చు అన్న నమ్మకం కుదిరింది ఇప్పుడు. ఈ సమస్య తానొక్కతికే పరిమితం కాదు. పని చేసే ప్రతీ స్త్రీ ఎదుర్కొనేదే.

డిజర్ట్ సమయానికి, గగన విహారం చేస్తున్న చంద్రుడు తన కాంతులు మరింత వెదజల్లడం మొదలెట్టాడు. అరసు తన దగ్గర ఉన్న రిమోట్ ద్వారా లైట్స్ ఆర్పడంతో సముద్రం, అలలు హోరుతో బాటు, బ్లాక్ అండ్ వైట్ సినిమా సీన్ లాగా కనిపించ సాగింది. ఆ సినిమాలో జీవిస్తున్నది, ఆ సినిమాను చూస్తున్నది ఇద్దరే.

ఆ ప్రకృతి అందానికి అరసు, ఆయషా కొంతసేపు దాసోహులైపోయి, తామిద్దరి మధ్య నిశ్శబ్దాన్ని రాజ్యమేలనిచ్చారు. ఆ నిశ్శబ్దాన్ని భంగ పరుస్తూ అరసు ఉన్నట్టుండి లేచి మోకాలు మీద వంగి ఆయషాకు రింగ్ ఇచ్చి "విల్ యూ? ఇప్పటికే ఆలస్యం చేసాను," అన్నాడు.

అయషా కు ఏమీ జరుగుతుందో తెలియడానికి సమయం బట్టింది. తను అరసు తో గడిపిన దినాలు, విడిపోయిన దినాలు గుర్తుకు వచ్చాయి. ఆయషా ఆశ్చర్యంతో దిగాలునా లేచి నిలబడి, అప్రయత్నంగా తన ఉంగరపు వేలు చాచింది. అరసు ఉంగరం తొడిగి, ఆయషాను కౌగలించుకొని గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు. ఆయషా అదే ఉద్వేగంతో అరసుకు హత్తుకు పోయింది. 'ఇప్పటికే ఆలస్యం చేశాం. ఎలా విడిపోయి ఉండగలం అనుకున్నాం' అన్న ఆలోచనలు ఇద్దరి మనస్సులలో మెదిలింది. ' ఆయషా సలీం కు టెక్స్ట్ చేసి ఆ రాత్రి అక్కడే ఉండిపోయింది.

మరుసటి రోజు నుంచి ఒకటే హడావుడి మొదలవ్వుతుందని ఆయషా కు తెలుసు. ముందు అమ్మ జుబెదా కు, సలీం కు ఇంటికి చేరిన వెంటనే చెప్పింది. వారి సంతోషానికి హద్దులు లేదు. అప్పుడే పెళ్లికి తయారైపోయారు.

"అయషా, మేమెంత సంతోషంగా ఉన్నామో తెలుసా? నీకు తెలియని విషయం మరొకటి ఉంది. ఇది వరకే అరసు నన్ను , అమ్మ ను కలిసి నీకు ప్రపోజ్ చేస్తానని అనుమతి తీసుకున్నాడు. అరసు వాళ్ళమ్మ, నాన్న లకు కూడా చెప్పాడని విన్నాను. మాకున్న ఒక ఆందోళన నువ్వొప్పుకుంటావో, లేదో అని," అన్నాడు సలీం.

సలీం అరసు కూడా చిన్నప్పటి నుంచే స్నేహితులు కాబట్టి సలీం అరసుకు ఫోన్ చేసి మరీ అభినందనలు చెప్పాడు.

ఆయషా లక్షి కి ఫోన్ చేసి చెప్పింది.

"కంగ్రాట్స్ ఆయషా. నాకు చాల సంతోషంగా ఉంది. నువ్వు అరసు మేడ్ ఫర్ ఈచ్ అదరని, నీ మాటల లోనే నాకు అర్థం అయ్యింది. ఇక కొన్ని రోజులు బిజి గా ఉంటావేమో కదా. పి.ఎల్. గ్రూప్ అధినేత ఇంట్లోకి అడుగు పెడ్తున్నావు. చాలా వేడుకలే ఉంటాయి. పని నుండి కొన్ని రోజులు బ్రేక్ తీసుకో," అంది లక్షి .

"థాంక్స్ లక్షి . నీతో మాట్లాడిన తరువాత నాకు కావలసిన క్లారిటీ దొరికింది. అందుకే అరసుకు మళ్ళీ దగ్గర కాగలిగాను. ఇక పని విషయంలో నువ్వన్నది నిజమే. ఈ ఎంగేజ్మెంట్ కాకపోతే, ఇప్పటికే, అక్కడికి తిరిగి రావడానికి తయారయ్యి పోయే దాన్ని."

"ఇక్కడి పని గురించి నువ్వు వర్రి కాకు. చాల వంతు పని నీవు పూర్తి చేసేసావు. మిగిలింది, నేను చూసుకోగలను. ఫోన్ టాప్ గురించి లారెన్స్ తో మాట్లాడాను. లారెన్స్ ఇంకో మంచి పని చేశాడు. అక్కడ నువ్వు అనుమానిస్తున్న వారి ఫోన్ టాప్ చేయడానికి భారత ప్రభుత్వంతో పని చేయాలి. మన టార్గెట్ మంగా కంపెనీ, దాని అధినేత రాజా కాబట్టి ఇక్కడ కోర్టులను ఆశ్రయించి రాజా మొబైల్ ఫోన్, ఆయన ఆఫీస్ ఫోన్ లు టాప్ చేయడానికి అనుమతి తీసుకున్నాడు. ఏదైనా ఋజువు, బ్రేక్ త్రూ దొరికితే నేనే నీకు ఫోన్ చేస్తాను. ఎంజాయ్!"

ఆయషాకు తరువాతి కొన్ని రోజులు అందమైన కల లాగానే గడిచిపోయింది. అరసుని ఆయషా వాళ్ళింట్లో కలవడం, అరసు వాళ్ళింట్లో కలవడం, ఆఫీస్ లో కలవడం, ఆఫీసు బయట కలవడం, వీలైనంత వరకు కలిసి తిరగడం తో సమయం ఎలా పరుగెడుతున్న దో తెలియలేదు. పి.ఎల్ కొడుకు ఎంగేజ్మెంట్ పార్టీ పెద్ద ఎత్తున జరగాలి అనడంతో, ఆ ఏర్పాట్లు మొదలయ్యాయి. అతనికి తెలిసిన వారు చాల మంది బిలియనీర్ లు, ప్రపంచమంతా ఉన్నారు. మరి ఈ ఫంక్షన్ ఎలా చేస్తారో తెలీదు. డబ్బులు ఖర్చుపెట్టడం లో వెనుక దీయరు కాబట్టి అది పెద్ద ఎత్తునే ఉంటుందని ఆయషా కు తెలుసు.

వారం తరువాత లక్షి నుండి ఫోన్ వచ్చింది.

"అయషా నువ్వు ఎంగేజ్మెంట్ కు పంపిన ఇన్వైట్ చూసాను. చాల బాగుంది. థాంక్స్. తప్పక రావడానికి ప్రయత్నిస్తాను అన్నట్లు ఆ రాజా ఫోన్ టాప్ చేయడంతో పెద్ద బ్రేక్ దొరికింది. నువ్వన్నట్లు అక్కడ మిట్టల్ గ్రూప్ లో పని చేస్తున్న సెంథిల్ రాజకు తన ఫోన్ కెమెరా ద్వారా తీసిన ఫోటోలు, మెసేజ్ చేసాడు. అందులో ఆ గ్రూప్ బోర్డ్ కు సమర్పిస్తున్న ఫైనాన్స్ వివరాలు ఉన్నాయి. ఆ తరువాత సెంథిల్ రాజా తో మాట్లాడాడు కూడా. అప్పుడు రాజా సెంథిల్ చేసిన పనికి ధన్యవాదాలు చెప్పడమే కాక అతని అకౌంట్లో డబ్బులు కూడా వేస్తానని చెప్పి, వెంటనే వేశాడు కూడా."

"సెంథిల్ కు రాజాకు ఎలా పరిచయం."

"అదీ ఇన్వెస్టిగేట్ చేసి ఇక్కడ కనుకున్నాను. రాజా, రాజాకు పని చేస్తున్న మనుష్యులు, పెద్ద కార్పొరేట్ కంపెనీలలో పని చేసే వారిని, ముఖ్యంగా భారతీయులను టార్గెట్ చేస్తారు. వారి ద్వారా, వారు పని చేస్తున్న కంపెనీ వివరాలు కనుక్కోవాలి అన్నది వారి పథకం. అందుకే వాళ్ళు ఇండియన్ లు తరచూ వెళ్ళే దీపావళి, దసరా లాంటి వేడుకలకు, బాగా డబ్బు, ఇన్ఫ్లుయెన్స్ ఉన్న భారతీయులు తమ ఇండ్లలో జరిపే పార్టీలకు తప్పకుండా హాజరవ్వుతారు. ఇన్వైట్ లేకున్నా, కృషి చేసి పిలిపించుకుంటారు. కొందరు అమాయకులు, నోట్లో నువ్వు గింజ నాన్చలేని వారు ఇట్టే కంపెనీ వివరాలు ఆ పార్టీలలో తమ గొప్పదనం చాటుకోవడానికి వాగేస్తుంటారు. అవన్నీ రాజా కు ఫ్రీ బీ లే. అలాంటి వారు కాకుండా మరి కొందరిని మాటల్లో పెట్టి, మంచి స్నేహితుడిగా, ఆప్తుడిగా మార డానికి ప్రయత్నిస్తారు. వారు రాజాకు తమ కంపెనీ వివరాలు, ఏదో గొప్పలు చెప్పుకొనే ప్రయత్నంలో నోరు జారితే, వారికి గిఫ్ట్ లు, వేకేషన్ ట్రిప్ లు స్నేహం రూపంలో ఏర్పాట్లు చేస్తాడు. ఇలాంటి ఖరీదైన గిఫ్ట్ లు, వెకేషన్ లకు అలవాటు పడిన కార్పొరేట్ ఉద్యోగులు, మళ్ళీ, మళ్ళీ నోరు జారుతూనే ఉంటారు. మిట్టల్ గ్రూప్ కి పని చేస్తున్న సెంథిల్ పిల్లలు అమెరికాలో పనిచేస్తున్నారు. వాళ్ళను కలవడానికి, వారి పిల్లలను చూసుకోవడానికి సెంథిల్, వాళ్ళ ఆవిడతో సహా, సంవత్సరంలో ఆరు నెలలు ఇక్కడ అమెరికా లోనే ఉంటాడు. రాజా అలా సెంథిల్ ను ఎక్కడో ఒక ఇండియన్ పార్టీ లో కలిసి తనకు పని చేసే లాగా మరల్చు కొని ఉండాలి. రాజా సెంథిల్ కు, అతని ఫ్యామిలీ కి ఇక్కడ రావడానికి బిజినెస్ క్లాస్ టికెట్లు, అప్గ్రేడ్ లు, ఇక్కడ వచ్చిన తరువాత వెకేషన్ పేకేజిల వంటి ఏర్పాట్లు ఇది వరకే చాల సార్లు చేశాడు."

"మొత్తానికి సెంథిల్ ఆ ఫైనాన్స్ వివరాలు రాజా కు అందిస్తున్నట్లు ఋజువు తో సహా పట్టేసుకున్నారు. ఇక మనకు మిట్టల్ గ్రూప్ వారు అందజేసిన ప్రోజెక్ట్ పని పూర్తి అయ్యి నట్లే కదా."

"ఆ పని పూర్తి అయ్యినట్లె. నీ వైపు రిపోర్ట్ పంపు. ఇక్కడ మేము కనుకున్నా వివరాలు జోడించి, నేను పూర్తి రిపోర్ట్ మిట్టల్ గ్రూప్ కు పంపిస్తాను. అన్నట్లు చెప్పడం మరిచాను, రాజా ఫోన్ టాప్ చేస్తుంటే మరో జాక్పాట్ తగిలింది. అరసు వాళ్ళ పి.ఎల్. గ్రూప్ బోర్డ్ లో ఉన్న ఒక డైరెక్టర్ రాజాకు ఫోన్ చేసి, ఆ గ్రూప్ ఫైనాన్స్ వివరాలు పంచుకున్నాడు. రాజా ఆ వివరాలను తన హెడ్జ్ ఫండ్ లాభాలకు వాడుకున్నాడు. వివరాలు పంపిస్తాను. నువ్వు అరసు తో ఆ విషయం పంచుకుంటే నాకు అభ్యంతరం లేదు," అని లక్ష్మి చెప్పి, ఆయషా తో వీడ్కోలు తీసుకుంది.

ఆయషా లక్షి పంపిన పి.ఎల్. బోర్డ్ మెంబర్ వివరాలు చూసి ఆశ్చర్య పోయింది. అతను దేశంలోనే గొప్ప పేరు పొందిన వ్యక్తి. ఆర్థిక రంగంలో అతనిని, అతడు తన కెరీర్ మలచు కున్న విధానాన్ని ఆదర్శంగా తీసుకునే వారు కోట్లల్లు. అమెరికాలో ఎస్.ఈ.సి. రాజా మీద కేసు పెట్టి, అతడి మంగా హెడ్జ్ కంపెనీ మీద ఆంక్షలు పెట్టి, దాన్ని కూడా మూత పెట్టినప్పుడు, భారత దేశం ప్రభుత్వానికి పి.ఎల్. బోర్డ్ మెంబర్ ను కూడా నేరస్తుడుగా నోటీస్ పంపుతారు. అతన్ని భారత దేశం నేరస్తునిగా పరిగణించక పోయినా, అతను అమెరికా దేశం లోనో లేక అమెరికాతో సహకరించే నేటో గుంపు లోని దేశం లోనో పొరబాటున ప్రయాణం చేస్తే అతనిని బంధించి అమెరికా న్యాయ విభాగానికి, అక్కడి చెరసాల కు పంపిస్తారు. లక్షి చెప్పిన మాటల ప్రకారం అది తను చేస్తున్న ఈ ప్రాజెక్టు రిపోర్టు సమర్పించిన కొన్ని రోజుల లోనే జరుగవచ్చు. లక్షి కంఠం లో ఈ ప్రాజెక్టు రిపోర్టు తొందరలోనే పూర్తి చేసి మిట్టల్ కంపెనీ కు వారి ద్వారా ఎస్.ఈ.సీ కి పంపించాలన్న ఆతృత వినిపించింది.

పి.ఎల్., సెల్వీ లు తమ వారసుడు అరసు ఎంగేజ్మెంట్ పెద్ద ఎత్తున చేయాలనుకున్నారు. ‘రాజు తలచుకుంటే…’ అన్న విధంగా ఏర్పాట్లు మొదలయ్యాయి. అరసు, ఆయషా ల సమయం పై ఈ ఏర్పాట్ల హడావిడి ప్రభావం మెల్లిగా ప్రారంభమై దినదినాభివృద్ధి చూపెడుతున్నది.

ఆయషా, ఆరసుకు ఫోన్ చేసి,”చాలా బిజి అయ్యిపోయాం. కేన్ వి గెట్ అవే ఫర్ ఆన్ అవర్?” అని అడిగింది

“అవును. సాయంత్రం డ్రెస్ ట్రయల్స్ కి ఇంటికి వస్తున్నావు కదా. కొంత ముందు రా. నాకు మెసేజ్ చేస్తే, నేనూ ఆ సమయానికి వస్తాను. అప్పుడు మాట్లాడు కోవచ్చు.”

సాయంత్రం అలానే అరసును కలిసినప్పుడు ఆయషా, తను మిట్టల్ గ్రూప్ కు చేస్తున్న పని, పి.ఎల్. బోర్డ్ మెంబర్ కు ఎలా దారి తీసిందో, దాని వల్ల పి.ఎల్. షేర్ల మీద వ్యాపారం ఎలా అక్రమంగా జరిగి ఎస్.ఈ.సీ వారి దృష్టి ఆకర్శించిందో వివరంగా చెప్పింది.

“నీ పని గురించి పూర్తి అవగాహన లేదు. నీవు ఇప్పుడు చెప్పుతుంటే, మీరు చేస్తున్న పని మంచి బిజినెస్ అవకాశం గా తోస్తున్నది. నువ్వు పని చేస్తున్న కంపెనీని పి.ఎల్. గ్రూప్ ఇట్టే కొనేయవచ్చు. నీవు ఆ కంపెనీ నడిపించి ఇంకా పెద్దది గా చేయవచ్చని పిస్తుంది. “

"నేను మీ బోర్డ్ లో డైరెక్టర్ గా ఉన్నతను పడబోయే కష్టాల గురించి, దాని వల్ల మీ కంపెనీ పేరు కూడా ఈ స్కాండల్ లోకి గుంజ బడడం గురించి నీవు ఆదుర్దా పడతావనుకుంటే, ఇదేంటి నా భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నావు," నవ్వింది ఆయుషా,"అయినా నేను చేస్తున్న బొటిక్ కంపెనీ అధినేత లక్ష్మి నాకు ఆప్తురాలు. ఆవిడ బేబి, ప్రాణం ఆ కంపెనీ. నువ్వు ఆ కంపెనీని కొనడం కష్టం. నాకిష్టం కూడా లేదు."

"మా బోర్డ్ లో అతను ఇండిపెండెంట్ డైరెక్టర్. పేరు బాగుందని బోర్డ్ లో పెట్టుకున్నాం. నువ్వు చేస్తున్న పని వల్ల అతడు నేరస్తుడిగా బయట పడితే, అతనిని బోర్డ్ లో నుంచి తీసివేసి, మరొకరుని ఎన్నుకుంటాం. పి.ఎల్ గ్రూప్ పేరుకు దెబ్బేమి తగలదు. ఇక నన్ను పి.ఎల్.గ్రూప్ అధినేతగా, నీ కాబోయే జీవిత భాగస్వామి గా చూస్తే, నా ఆలోచనలు సరినే కదా?"

"నీవన్నావు కాబట్టి ఇప్పుడే ఇంకో ఆలోచన వచ్చింది. మా చిన్న కంపెనీ కొనే బదులు, సగటు మానవ జీవితాలు మెరుగు పరిచే ప్రయత్నం చేసే స్టార్ట్ అప్ కంపెనీలకు చేయూత నిచ్చే ఒక కంపెనీ మొదలెట్టొచ్చు కదా."

"ష్యూర్. వై నాట్? అలాంటి వెంచర్ క్యాపిటల్ ఫైనాన్స్ కంపెనీ కావాలంటే నువ్వే మొదలు బెట్టు..."

"మొత్తానికి చారిటీ కంపెనీ మాత్రం మొదలెట్ట నంటావు. నీ వ్యాపార బుద్ధి పోనిచ్చావు కాదు..." నవ్వుతూ అరసు భుజం మీద చిన్న చురక వేసింది ఆయుషా.

అలా భవిష్యత్తు గురించి ఆలోచనల తో మరో లోకంలో విహరిస్తున్న ఆయుషా, అరసులకు ఇహలోకంలో నుంచి వారి కోసమే కుట్టిన దుస్తులు వేసి, చూడడానికి, ప్రపంచ వ్యాప్తంగా పేరున్న ఫ్యాషన్ డిజైనర్ నుంచి పిలుపు వచ్చింది.

Post your comments